# ఎక్కడుంది లోపం?

**అవసరాల రామకృష్ణారావు**



మనసిచ్చిన ప్రియుడు ఒళ్ళంతా కితకితలు పెడితే పట్టలేని ఆనందంతో నిలదొక్కుకోలేక కిందా మీదా పడుతున్న అందమైన అమ్మాయి అవస్థలా ఉంది జడివానలో తడుస్తున్న వరద గోదావరి. ఇప్పుడీ మెరుగంచు నల్లచీర కట్టుకుని ఇంతలా గెంతుతోందా యీ నదీ సుందరి, మరో ఆరు నెలలు పోయాక ఓ వేసవినాటి వెన్నెల రాత్రి చూడండి, ఎక్కడ ఉన్న జాడా కన్నజాడా లేక ఎంతో కొత్తగా ఎప్పటికీ అర్థం కాని దాన్లా కనిపిస్తుంది!

ఎలా ఉంటేనేం, ఈ గోదావరి నాకు ఆత్మీయురాలు.

నేను చేస్తున్న ఆయుర్వేద మందుల కంపెనీ రిప్రజెంటిటివ్ పని నాకెంతో విరాశాజనకంగా ఉంటుంది. సామర్లకోట మంచి తాడేపల్లిగూడెందాకా నెల రెండు సార్లయినా తిరగాలి. ప్రాణం విసిగి పోతుంది. కొత్తలేని ఈ జీవితంలో ఎప్పటికప్పుడు నాకు కొత్తగా తోచేది గోదావరి ఒక్కటే. అందుకే బ్రిడ్జిమీంచి, రైల్లోంచి, ఎన్నిసార్లు చూసినా తృప్తిలేక, గోదావరి స్టేషను రైలు దాటీ దాటగానే ఎలాగో వీలు చూసుకుని కిటికీ దగ్గిర చేరుతాను. దూరదూరమయ్యే గోదావరి స్నానఘట్టాలూ, దగ్గిర దగ్గిరయ్యే కొవ్వూరు సుందరేశ్వరస్వామి గోవు పాదాల రేవూ, "అయ్య బాబోయ్, ఇన్ని వంతెల దూరమూ దాటవలసిందే" అని ఎప్పటికప్పుడు రైలు చక్రాలు బాదుకునే గుండె చప్పుళ్ళూ, 'మా బతుక్కి ఇప్పట్లో వెలుగు చూసే యోగం లేదుకాబోలు" అని గోలచేస్తున్నట్టు కనిపించే క్రొత్త బ్రిడ్జి స్తంభాలూ,.... ఇలాంటి వాటిలో పెద్ద గుర్తించవలసిన మార్పేం నాకు కనపడదు....కాని గోదావరి తమాషా ఎంతటిదంటే వెడుతున్నపుడు కనిపించే చిన్న ఇసకదిబ్బ తిరుగు ప్రయాణంలో నాకు కనిపించదు....

"అటేం చూస్తావ్, ఇలా రారా పూల్."

అని నా మెడమీద చెయ్యివేసి యివతలికి లాగేడు మా సోము. వాడు నాతో స్కూలు పైనలు దాకా వెలిగించాడు. రాజమండ్రిలో రైలెక్కేడు. బెజవాడ వెడుతున్నాట్ట....అది బాగా రష్‌గా ఉన్న థర్డుక్లాసు కంపార్టుమెంటు. సగంమందిమి నిలబడే ప్రయాణం చేస్తున్నాం.

అక్కడున్న ప్రయాణీకుల్ని బతిమాలి ఎలాగో చోటు చేయించి కంపార్టుమెంటు ఎంట్రెన్సు పక్కనున్న కిటికీలోంచి నన్ను

చూడమన్నాడు సోము చూశాను. గుండె గుభేలుమంది.

తేనె తుట్టెమీద ఈగల్లా వేళ్ళాడు తున్నారు జనం....

కిందని నాలుకలు చాస్తూ ఆహ్వా నిస్తున్న అఖండ గోదావరి.

ఏది పీలైతే అది పట్టుకుని- ఎలాగో నిలదొక్కుకుని, గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని వేళ్ళాడుతున్న ప్రయాణీకులు!

"పాపం ఎంత ఇబ్బంది పడుతున్నారు ప్రజ! ప్రాణాలకి తెగించేనా ప్రయాణాలు చేస్తారుగాని ఇంతకుమించి ఖరీదైన క్లాసులో.... బీదవాళ్ళు ఎలా వెళ్ళగలరు మరి" అన్నాను.

"అందరికంటే బీదవాడు అఖర్న వేళ్ళాడుతున్నాడు చూడు! అన్నాడు సోము నా చెవిదగ్గర నోరు పెట్టి: మెడ మరి కొంత సారించి చూశాను. పంచె, చొక్కా చెప్పులూ ఇవి బీదవాడి దుస్తులు కావు. అలా అని గొప్పవాడి దుస్తులూ కావు. ఆశ్చర్యంగా సోము వైపు చూశాను.

"రాజమండ్రీ మెయిన్ రోడ్డులో భాటా షాపు పక్క సొరంగంలాంటి పెద్ద ఇనప కొట్టుంది గుర్తుందా? దాని హోల్ ప్రొప్రయిటరు జంబులింగం ఇతనే"

బ్రిడ్జిమీంచి వెడుతున్నది ప్యాసెంజరు బండి. నా బుర్రలో అట్నుంచి ఇటు పరుగెత్తింది మాత్రం పంజాబు మెయిలు!

ఇది సాధ్యమా?

ఇలా జరుగుతుందా ఎక్కడైనా?

అతనికేం ఖర్మం, లక్షాధికారి, థర్డు క్లాస్ కంపార్టుమెంటు కమ్మీ పట్టుకు వేళ్లాడ్డానికి!

ఆ రష్‌లో తెలిసిన మొహం మరొకటి విష్ చేసింది. అతనిద్వారా రుజువయింది, ఆ వ్యక్తి జంబులింగమే!

ఉన్నట్టుండి వర్షపుజల్లు విజృంభించింది.

దాన్తోపాటు రివ్వున గాలి ఒకటి....

"బాబ్బాబు .... కాలు జారిపోతోంది. కొంచెం చోటియ్యి....ఇటు వైపు హేండిల్‌ని కొంచెం అనుకోనియ్యి"

అని లక్షాధికారి జంబులింగం పైమెట్టు మీద నిలబడిన ఓ ముష్టి వాడ్ని హృదయ విదారకంగా బతిమాలు కొంటున్నాడు!

వంగి చూశాను.

అతని కళ్ళల్లో మృత్యుభీతి!

ఆ భయాన్ని చూసి ఎవరిమటుకు వాళ్లు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

"రావనియ్యండి వెధవని....పిడ్చిమొర పెట్టుకున్నా అంగుళం జాగా ఇవ్వకండి. దేశంలోని ఐశ్వర్యం అంతా ఇలాంటి పసిమంది చేతుల్లో కప్పబడిపోయింది. మన యీ కంపార్టుమెంటులోని జనం మొహాలే చూడండి. మన యీ దారిద్ర్యానికి సౌర్భాగ్యానికి యిలాంటి వాళ్లు కారణం కాదూ?"

అని మా సాంబు అందరికీ పురెక్కించాడు.

ముష్టివాడు జాగా ఇవ్వలేదు. పక్కని వేళ్ళాడుతున్న సాంబు జరగలేదు. పక్కనున్న గడ్డపాయనా, అటూ యిటూ నిలబడ్డ మద్రాజ్లు ఎవ్వరూ కొంచెమయినా సద్దుకోలేదు.



"గాలి విసిరేస్తోంది .... పట్టుదొరకడం లేదు....కొంచెం లోపలికి సద్దుకోండి బాబుల్లారా...."

ఉన్న శక్తినంతటినీ కూడదీసుకుని జంబులింగం అరిచాడు. ఆ అరుపు విని అందరూ గొల్లున నవ్వేరు.

నాకు సిగ్గువేసింది.

జంబులింగం అవస్థ చూసికాదు.

తోటి ప్రయాణీకుల ప్రవర్తనని చూసి.

ధనికుడిగా ఉండడమే అతను చేసిన పాపమా?

పోనీ మహా పాతకుడు అనుకుందాం. అతనికి శిక్ష విధించడానికి వీళ్ళకేం అధికారం ఉంది! అతన్ని దోషిగా నిర్ణయించడానికి వీళ్లెవరు?

అతను కింద పడిపోతే వీళ్ళకేం కలసి వస్తుంది! వెయ్యి అనుమానాలు చుట్టుముట్టేయి నన్ను. అయినా ఆలోచనలకిది సమయం కాదు.

ఎలాగో చోటు చేసుకుని అందర్నీ తోసుకుని వెళ్ళి అతనికి చెయ్యి అందించాను. ఆ ఊతని అంది పుచ్చుకుని, కొంచెం పైకి ఎగబాకి, హేండిల్‌ని రెండో చేత్తోకూడా పట్టుకుని, నిలదొక్కుకున్నాడతను.

"అందరం అలా ఊరుకుంటే అంత మనిషీ హాయిగా గంగలో కలిసిపోనా?" అని వాళ్లు అనుకోడం ఎంత పొరపాటో.

"నేను చెయ్యి అందించబట్టి జంబులింగం బతికాడు!" అని నేను జబ్బ చరుచుకోడం కూడా అంత పొరపాటే!

ఆ సంగతి నాకు తెలియక కాదు.

కాని సాధారణ మానవ బలహీనతలకు నేనూ అతీతుడ్ని కాను.

"నాకు ప్రాణదానం చేశారు. మీ మేలు మరిచిపోలేను!" అంటాడని అతన్నించి ఆశించలేదు. కాని నాకు దగ్గిరగా వచ్చి "నేను స్టేషన్లో కొచ్చేసరికి రైలు కదిలిపోయిందండీ.... ఏదో ఒక కంపార్టుమెంటని ఎక్కేశాను. పనితొందరవల్ల.... ఇలాంటి కబుర్లేవో చెబుతాడని ఆశించాను. అలాంటిదేదో జరిగి ఉంటుందనే నా నమ్మకం. కాని అతను ఏం మాట్లాడలేదు నాతో. కొవ్వూరులో రైలు దిగి వెళ్ళిపోయినప్పుడు మాత్రం ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు అందర్నీ... ఆ చూపులో వాళ్లమీద కసీ కనబడలేదు, నా మీద కృతజ్ఞతాభావమూ కనపడలేదు!

ఆ తర్వాత స్టేషనులో కొంచెం ఖాళీ అయినట్టుంది.

ఇంకా నిలబడే ఉన్నావేం. రా ఇక్కడ జాగా ఉంది,

అని కొంచెం ఖాళీ చేసి తన పక్కన కూచోబెట్టుకున్నాడు సోము.

"ఏం ఇంకా ఆ జంబులింగంగాడి ఆలోచనలు వదలలేదా నిన్ను? మంచి అవ

కాశం! మధ్యలోవచ్చి ఎగరగొట్టేశావు. అయినా నిన్ననుకుని ఏం లాభంలే.... హేండిల్ పట్టుకున్న ఆ చెయ్యిమీద నేనే కాలితో ఓసారి తన్ని ఉండవలసింది. దెబ్బకి పిట్టలా పడిపోను, ముండా కొడుకు. అంతకి తెగించలేకపోయాను.... అన్నాడు ఆవేశంతో.

"ఏం అతనుపోతే ఆ ఆస్తి నీకేమైనా కలిసొస్తుందా?"

"నా కెందుకు ఆ పాపపుసొమ్ము?"

"ఏం అతను గడించింది పాపపు సొమ్మా?"

"లేకపోతే. దేశమంతా అన్నమో రామచంద్రా అని అలమటించిపోతుంటే ఒక్కమనిషి అన్ని లక్షలు కూడబెట్టడం మంచిపద్ధతుల వల్ల సాధ్యమయ్యేదే అంటావా?"

"అతను అన్యాయంగా గడించాడని నీకేమైనా రుజువుందా?"


"వర్ణించలేనిలుబ్ధత్వంతో పైసా పైసావడ్డీలకు తిప్పకపోతే ఎందరి కొంపలో నిలువునా కూల్చకపోతే, యింత డబ్బు ఎలా వచ్చే దంటావ్? నీ కళ్ళతో నువ్వే చూశావ్ కదా, వేరేరుజువెందుకు? రాజమండ్రి నుంచి కొవ్వూరికి ఫస్టుక్లాసు టిక్కెట్ ఎంతయి పోతుందని చెప్పు? వాడికి ముందు డబ్బూ, తర్వాత ప్రాణమున్నూ."

"టిక్కెట్ దొరకలేదేమో ఇంత తక్కువదూరానికి ఫస్ట్‌క్లాస్ యివ్వరేమో!"

వాడు లేచి నిలబడ్డాడు. "అదిగో అక్కడ కిటికదగ్గర ఖాళీ అయినట్టుంది. సిగరెట్ కాల్చుకోవాలి. అక్కడికి పోతా." అంటూ లేచి గబగబా వెళ్ళిపోయాడు. వాడికి నేను జంబులింగాన్ని వెనకేసుకు రావటం నచ్చలేదు.

ఎన్నాళ్ళయినా బతుకులోని కనీసపు కోర్కెలు తీరని యిలాంటి వాళ్ళకి నెత్తిమీద బరువువల్ల బ్యాలన్సు చిక్కక సరిగ్గా ఆలోచించడానికి అవకాశం ఉండదేమో! అనుచితమైన అసూయా, చేతకానితనంతో ఏర్పడిన కసీ మనిషిలోని సహజమైన సౌమనస్యాన్ని నశింపజేస్తాయేమో! సోముని చూసి జాలిపడ్డాను నేను. నేను రెండుకాళ్ళూ ఎదంగాపెట్టి ఈజీగా కుర్చీనేలోగా యిందాక విష్ చేసిన మనిషి-

"అక్కడ ఖాళీ అయిందా మాష్టారూ?"




అంటూ నా పక్కనవచ్చి కూచున్నాడు.

మాటల ధోరణిలో అతనివల్ల జంబులింగం భోగట్టాలు మరికొన్ని తెలిశాయి.

నడివయస్సులో జంబులింగానికి భార్య పోయిందట. మళ్ళీ ఎవరెంతచెప్పినా పెళ్ళి చేసుకోలేదు .... పిల్లలులేరు తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారుట. నా అన్నవాళ్ళు అతనికెవరూలేరు. గుమాస్తా, వంటమనిషి, కొట్లో ఇంట్లో పనిచేసే ఓ నౌకరూ అతని అనుచరవర్గం.

వేళకి కొట్టు తీయడమూ మూయడమూ, పైసా తేడాలేకుండా ఏరోజుకారోజు ఎకౌంట్ మెయిన్‌టెయిన్ చెయ్యడమూ-ఎప్పటికప్పుడు బకాయిపెట్టకుండా పన్నులు చెల్లించడమూ....మంచి క్రమశిక్షణవున్న వ్యాపారస్థుడని చెబుతాడు ఈ గుమాస్తా.... అతను మాకు దూరపు బంధువు .." అతనలా చెప్పుకుపోతుంటే

"మరి ఈ వచ్చిన లాభమంతా ఏం చేస్తాడుట?" అని అడుగుదామని నోటికొసదాకావచ్చి అతి బలవంతంమీద ఆపుకున్నాను. ఇంకొకళ్ళ సంపాదనా ఖర్చూ గురించి అడగడం మించిన చచ్చుప్రశ్న లోకంలోలేదు. అంతకన్న హీనమయిన భోగట్టాకూడా లోకానికిలేదు. అయితే నేను అడక్కుండానే ఆ వివరాలు యిచ్చాడు అతను.

జంబులింగం ఏటా ఏ తిరపతికో వెళ్ళిరాడు. ఏ బొంబాయికో వెళ్ళి జల్సాచేసి రావడం అతను ఎరగడు. ఏ ధర్మసంస్థలకీ అతను విరాళాలు యివ్వడు. ఇనపకొట్టు ఆస్తికాక, కొవ్వూరు దగ్గర అతనికి పొలాలున్నాయి. ఇవికాక మరికొన్ని భోగట్టాలు చెప్పి. క్షణక్షణానికీ నాకు బోధపడకుండా పోతున్న జంబులింగం సమస్యను మరింత జటిలంచేసి అతను ఆవక్క స్టేషనులో దిగిపోయాడు.

*　　*　　*

ఆ తరువాత నెలా పదిహేను రోజులనుకుంటాను, పాసెంజర్లో తిరుగు ప్రయాణం చేస్తున్నాను. బండి కొవ్వూరు దాటగానే యథాప్రకారంగా కిటికీ దగ్గర చేరి గోదావరి చూస్తున్నాను తన్మయత్వంతో. "నాలుగు చినుకులు రాలితే నదులు ఎలా కిందామీదా ఉండవో, నాలుగు డబ్బులు చేరితే మనిషీ అలాగే భూమీ ఆకాశం అనడు!" అనిపించింది.

"చూశారా, చూశారా, దానిషోకు చూశారా?"

నా దగ్గరగా కూచున్న ఒకావిడ పక్కనున్న మొగుణ్ణి గోకింది. ఏమిటో అని అటుచూశాను. ఎవరో ఒక నడివయసుస్త్రీ ఇద్దరు పిల్లలతో ప్రయాణం చేస్తోంది.

రాజమండ్రిలో మొగుడికి ఉద్యోగమనీ, పుట్టింటికి వెళ్ళొస్తున్నానని ఆవిడ పక్కావిడతో చెప్పడం ఇందాకే విన్నాను. అంత రష్‌లోనూ తనువెళ్ళి మొహం కడుక్కుని బట్టలు మార్చుకురావడమేకాక, ఆడపిల్లలిద్దర్నీకూడా నీట్‌గా ముస్తాబుచేసింది.

నా దగ్గిర కూచున్నావిడ మళ్ళీ గునగున లాడింది.

"ఇంటికి ఎలాగా వెళిపోతుందికదా ఇప్పుడు పౌడరురాసుకుని తల దువ్వుకోకపోతే దీని అందానికేం లోపం వచ్చింది చెప్పండి? జరుగుతుంటే ఎన్ని నాటకాలయినా ఆడొచ్చు. మొగుడి ఉద్యోగంకాక అత్తారిదో పుట్టింటారిదో బాగా డబ్బు ఉండి ఉంటుంది. అదైనా ఎందర్ని మలమల మాడిపిస్తే దక్కిందో!"

ఆవిడ ఎంత నెమ్మదిగామాట్లాడినా మరీ దగ్గిరకూచోటంచేత ప్రతీముక్కా వినబడింది. ఆ విమర్శచూసి నా ప్రాణం చివుక్కుమంది. నా మనసెందుకో ఆపిల్లల తల్లిని వెనకేసుకు రాసాగింది. ఆవిడ మెడ్రాసు నుంచి వస్తున్నదని విన్నాను, అన్నిగంటలసేపుప్యాసెంజరు ప్రయాణం. అందులో రష్ ఏమీ తక్కువగాలేదు. అయినా ఆ అలసటేమీ కనబడకుండా పరిశుభ్రంగా తయారయి, పిల్లల్నికూడా అలంకరించి, చిరునవ్వుతో భర్తను కలుసుకుందామని తాపత్రయ పడుతోంది.

"కొంచెం మంచి నీళ్ళిద్దూ" అని మొగుడడుగుతే "కాళ్ళకింద మరచెంబులో ఉన్నాయి మీరే తీసుకు తాగుదురూ" అని సలహాయిచ్చి అటు జారబడి కూచున్న ఈవిడేనా ఆవిడగురించి నీచంగా మాటాడుతున్నది! ఇంతకీ ఆ విడ చేసిన నేరం మెళ్ళోనూ, చేతులకీ యీవిడకంటె ఎక్కువ బంగారం ఉన్నదిగా కనబడడమే!

ఈ లోకానికి డబ్బున్నవాళ్ళు ఎంత కంటకప్రాయులు!

నాకు హఠాత్తుగా ఆనాటి సోము రిమార్కు, జంబులింగానికి సేవ చెయ్యి ఆసరా యివ్వడమూ జ్ఞాపకం వచ్చాయి.

"ఇరవైరెండు .... ఇరవైమూడు .." ఎవరో ఇద్దరు పిల్లలు బ్రిడ్జిమీద స్థంభాల సంఖ్య లెక్క పెడుతున్నారు.

ఏ కారణంచేతో నాలో జంబులింగం మీద ద్వేషభావంమాత్రం కలగలేదు.

ఆరోజు నలుగురూ కలసి అతన్ని దుయ్యబట్టడమే నాకతనిమీద సానుభూతి ఏర్పడ్డానికి కారణమేమో....

ఆ రోజు ఏదో పొరపాటు జరిగి అతనలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేయవలసి వచ్చి ఉంటుందిగాని అలా చావు బ్రతుకుల చూరుపట్టుకొని వేళ్ళాడ్డాని కతనికేం ఖర్మ అతనికేంలేదా, పోదా! ఆరోజు, ఆకంపార్టుమెంటు దగ్గిరకూడా! ఎవరో యిద్దరు ఫుట్‌బోర్డుమీద నిలబడి ఊచపట్టుకొని ప్రయాణం చేస్తున్నారు మరి!

అలా అనుకుంటూనే బాగా బుర్రవంచి కిటికీలోంచి చూశాను అలావేళ్ళాడుతున్న వాళ్ళలో అవతలి వ్యక్తి జుత్తుగాలి కళ్ళలో పడుతుంటే తలఊపుతూ ఇటు తిరిగేడు.



నా కళ్ళను నేను నమ్మలేక పోయాను.

ఆ వ్యక్తి జంబులింగం!

ఈసారి రాజమండ్రి వెళ్ళినప్పుడు అతన్ని కలుసుకుందామనీ, అతన్తో పరిచయం చేసుకుందామనీ ఎంతో అనుకున్నాను. ఆక్షణాన, మళ్ళీ ఆ పరిస్థితిలో అతన్ని చూచి, త్రికరణశుద్ధిగా అసహ్యించుకున్నాను. ఇలాంటి మనిషిని మనిషిగా గుర్తించినందుకు సిగ్గుపడ్డాను. కప్పెట్టినంత ఆస్తి ఉందంటున్నారు, కూడానాలుగు కొమ్ములు కట్టిపెట్టు గెడతాడా? వీడికడుపు మండ, చావడానికైనా సిద్ధమవుతున్నాడుగాని మనిషి నాలుగు రూపాయలు మనవి కావని ఫస్ట్‌క్లాసులో ఎక్కడే! పోనీ ఓమారు పొరపాటున అలా జరిగిందనుకుంటే, మళ్ళీ యిప్పుడు కళ్ళతో చూసినదానికి ఏం జవాబు చెప్పుకోడం! ఇలాంటి పరమ లుబ్ధుణ్ణి గురించా యిన్నాళ్ళు ఎంత ఎక్కువగా నేను ఆలోచిస్తూంట.....ఛీ....

అలా కసిదీరా నిందించి అతని గురించి ఆలోచనలను ఆక్షణమే తెగతెంపులు చేసుకుందామనుకున్నా.... ఉహుం .... అది మాత్రం నావల్లకాలేదు. ఇల్లు చేరుకుని యీ శరీరం పక్కమీద చేర్చిన వేళకూడా యీ మనసు విశ్రాంతి తీసుకోనని మొరాయించింది.

'ఆ సోము కన్న నీ ఆర్థిక పరిస్థితి ఏమంత మెరుగు! నువ్వూ అలాగే అంచనా వేశావు. మీలాంటి వాళ్ళు మరోలా ఆలోచించలేరు. అని నాలో ఉన్నదేదో నన్ను పరిహసించింది.

ఆ జంబులింగం అలా ఫుట్‌బోర్డుమీద వేళ్ళాడుతున్నాడని కాక ఫస్టుక్లాస్ కంపార్టుమెంటు కుషన్‌మీద దొర్లుతున్నాడని ఊహించుకుంటే నీ మనస్సుకి తృప్తి ఔతుందా? అందువల్ల ఈ అశేష బీద ప్రజానీకానికి అమాంతంగా కలిసివచ్చే దేమైనా ఉందా! అదీగాక ఏక్లాసులో ప్రయాణం చేయ్యాలో అది పూర్తిగా అతని పెర్సనల్ విషయం.... అందులో రిస్కుఏదైనా ఉంటే అతన్నే అనుభవించనివ్వండి. అదిసాకుగా తీసుకొని అతని మంచి చెడ్డలు నిర్ణయించడానికి నువ్వెవరివి మధ్య? అంతా అతనే తినేస్తున్నాడనీ అందువల్లే మీకడుపు మాడిపోతోందనీ ఎలాగా దుఃఖపడుతున్నారు. అతన్ని కాస్సేపు వేళ్ళాడనివ్వండి. కష్టమనితోస్తే అతనే మానేస్తాడు. అందుకని మీకాళ్ళూ చేతులూ పీకడంలేదుగద ఖర్మ.... ఏం దానికీ అతనికి స్వాతంత్రం లేదంటారా!'

లోపల్లోపల్నించి పుట్టుకొస్తున్న యీ ప్రశ్నలకి జవాబులు నాకు తెలియవు. నా ఆలోచనలో ఏదో ఎక్కడో లోపం ఉందని నాకు తెలుసు. లేకపోతే అంత అసంతృప్తిగా ఫీలవను. గొప్పవాళ్ళు బీదవాళ్ళని పీడిస్తున్నారో, లేక గొప్పవాళ్ళ ఆలోచనలు బీదవాళ్ళని పీలుస్తున్నాయో ఎంత ఆలోచించినా నాకు తెలీలేదు.

□□□